
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కర్నూలు
జిల్లా వార్తలు 5
గురువారం 19 సెప్టెంబరు 2024

వందనాలు



- నేటికి టీడీపీ కూటమి ప్రభుత్వానికి వంద రోజులు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో కూటమికి చారిత్రక విజయం
- ఓర్వకల్లు పారిశ్రామికవాడ అభివృద్ధికి రూ.2,786 కోట్లు
- ఉద్యోగుల బదిలీలతోనే తొలి మూడు నెలల పాలన
- జిల్లా ప్రగతిపై ఎమ్మెల్యేలు దృష్టి సారించాలి

కర్నూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జూన్ 12 ఆ రోజు ఉదయం 9.27 గంటలు... గన్నవరం సమీపంలోని కేసరిపల్లి ఐటీ వేదిక... నాలుగోసారి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం. సరిగ్గా నేటికి వంద రోజులు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొనిదెల పవన్‌కళ్యాణ్ సారథ్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం జూన్ 12న కొలువుదీరింది. చంద్రబాబు మంత్రివర్గంలో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డిలకు స్థానం దక్కింది. బాబుతో పాటు ప్రమాణాస్వీకారం చేశారు. టీడీపీ ఆవిర్భావం తరువాత జరిగిన ఎన్నికల్లో ఆ పార్టీ సారథ్యంలో కూటమికి కర్నూలు ప్రజలు చారిత్రాత్మక విజయం అందించారు. ఓర్వకల్లు పారిశ్రామివాడ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.2,786 కోట్లు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం మినహా జిల్లాలో చెప్పుకోదగ్గ అభివృద్ధి వైపు అడుగులు పడలేదు. ఉద్యోగుల బదిలీలు, రాజకీయ సర్దుబాట్లతో వంద రోజులు గడచిపోయాయి. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అభివృద్ధి వైపు అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత లోకేశ్ పాదయాత్ర సందర్భంగా, జిల్లా పర్యటనలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు పలు హామీలు ఇచ్చారు. అదే క్రమంలో ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులుగా ఎమ్మెల్యేలు కూడా పలు హామీలు ఇచ్చారు. నియోజకవర్గాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేయాలి. ఆ ప్రణాళిక అమలు దిశగా అడుగులు వేయాలి.

టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో సాధించిన భారీ విజయం ఓర్వకల్లు పారిశ్రామికవాడ అభివృద్ధికి రూ.2,786 కోట్లు కేటాయిస్తూ కేంద్రం ప్రభుత్వం ఆమోదం తెలపడం. గత టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు 33 వేల ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వెయ్యి మెగా వాట్ల సోలార్ యూనిట్ ఏర్పాటు చేశారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ప్రపంచంలోనే తొలి పంప్డ్ స్టోరేజ్ పవర్ ఉత్పత్తి యూనిట్ 3,500 మెగావాట్లతో నిర్మాణానికి నాంది పలికారు. 1,010 ఎకరాల విస్తీర్ణంలో.. రూ.110 కోట్లతో కర్నూలు(ఓర్వకల్లు) విమానాశ్రయం నిర్మించారు. 2019లో జగన్ ప్రభుత్వం రాకతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పురోగతి అటకెక్కింది. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో ప్రగతి అడుగులు పడ్డాయి.

ఆయా నియోజకవర్గాల్లో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు చేపట్టలేదు. మంత్రి టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి సహా ఎమ్మెల్యేలు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, గౌరు చరిత, బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, డాక్టర్ పార్థసారథి, కేఈ శ్యాంబాబు, భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్తా జయసూర్య సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు.. వంటి చిన్నచిన్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనాలు చేయడం మినహా భారీ ప్రాజెక్టుల వైపు అడుగులు వేయలేదని తెలుస్తుంది. వివిధ శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన శాశ్వత అభివృద్ధి పనులపై శాఖల వారిగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ప్రణాళికలతో సరిపుచ్చకుండా వాటి అమలుపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీడీపీ కూటమి చారిత్రాత్మక విజయం

టీడీపీ ఆవిర్భావం తరువాత ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని టీడీపీ సారథ్యంలోని టీడీపీ కూటమి సాధించిన చారిత్రాత్మక విజయం అందుకుంది. ఉమ్మడి జిల్లాలో 13 అసెంబ్లీ స్థానాలకు గాను 1983లో జరిగిన ఎన్నికల్లో ఆనాడు ఎన్టీఆర్ ప్రభజనంలోనూ ఆరు అసెంబ్లీలోనే విజయం సాధించారు. ఆ తరువాత ఎన్టీఆర్ ప్రభుత్వం భర్తరఫ్ చేయడంతో 1985లో జరిగిన ఎన్నికల్లో 8 స్థానాల్లో టీడీపీ గెలిచింది. 1989లో 4 స్థానాలతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. 1994లో జరిగిన ఎన్నికల్లో 8 స్థానాలు, 1999లో నాటి సీఎం చంద్రబాబు సారథ్యంలో జరిగిన ఎన్నికల్లో 10 స్థానాల్లో విజయం దక్కించుకున్నారు. 2004 ఎన్నికల్లో ఆనాటి పీసీసీ అధ్యక్షుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర ప్రభంజనం వల్ల కేవలం ఒకే ఒక స్థానాని (పత్తికొండ)కే పరిమితమైంది. 2009లో నాలుగు స్థానాలు దక్కించుకుంటే.. రాష్ట్ర విభజన తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో కేవలం 3 స్థానాల(పత్తికొండ, ఎమ్మిగనూరు, బనగానపల్లె)తో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. 2019 ఎన్నికల్లో ఒక్క స్థానంలో కూడా గెలవలేదు. 1999 ఎన్నికల్లో మినహా టీడీపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. టీడీపీ ఆవిర్భావం తరువాత 42 ఏళ్లలో 10 పర్యాయాలు ఎన్నికలు జరిగితే.. తొలిసారిగా కర్నూలు, నంద్యాల పార్లమెంట్ స్థానాలతో పాటు 12 అసెంబ్లీ స్థానాల్లో చారిత్రక విజయం అందుకుంది.



రూ.2,786 కోట్లతో ఓర్వకల్లు పారిశ్రామికవాడ అభివృద్ధి!

ఆగస్టు 28న నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎన్ఐసీడీపీ)లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో.. రూ.2,786 కోట్లతో అభివృద్ధికి కేంద్రం ఆమోద ముద్ర వేసింది. రూ.12 వేల కోట్లు పెట్టుబడులు.. 45,071 మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన అతిపెద్ద విజయం ఇది. ఇది మినహా



జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ





ఎమ్మెల్యేలు వీటిపై దృష్టి సారించాలి..!

- కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్ పట్టణాల్లో 22,851 ఏపీ టిడ్కో ఇళ్లు గత టీడీపీ ప్రభుత్వంలోనే పూర్తయ్యాయి. 2019లో వచ్చిన జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. టీడీపీ కూటమి ఎమ్మెల్యేలు మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు పంపిణీ చేసి వినియోగంలోకి తీసుకురావాలి.
- ఆదోని వైద్య కళాశాల రూ.475 కోట్లతో 13.31 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 420 బెడ్స్ బోధనాస్పత్రి నిర్మాణం చేపట్టారు. కర్నూలు మెడికల్ కళాశాల (కేఎంసీ), ప్రభుత్వ సర్వజన వైద్యశాల (బోధనాస్పత్రి) బలోపేతం పనులు రూ.500 కోట్లతో చేపట్టారు. 20 శాతం పనులు కూడా పూర్తి చేయలేదు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టింది కదా అని నిర్లక్ష్యం చేయకుండా తక్షణ ప్రాధాన్యతగా పూర్తి చేయాలి.
- ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని రూ.1,942.38 కోట్లతో వేదావతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాలకు సాగు, తాగునీరు ఇవ్వాలనే సంకల్పంతో రూ.1,985.42 కోట్లతో ఆర్డీఎస్ కుడి కాలువ పనులు గత టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. గుండ్రేవుల ప్రాజెక్టుకు రూ.2,900 కోట్లు మంజూరు చేస్తే.. జగన్ ప్రభుత్వం వచ్చాక అంతర్‌రాష్ట్ర జల వివాదం పేరిట అటకెక్కించారు. కూటమి ఎమ్మెల్యేలు వీటి సాధన కోసం ప్రత్యేక చొరవ తీసుకోవాలి.
- హంద్రీనీవా ప్రాజెక్టులో భాగమైన పత్తికొండ (పందికోన) జలాశయం కుడి, ఎడమ కాలువలు పూర్తి చేస్తే పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 65 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే అవకాశం ఉంది. రూ.200 కోట్లతో

ప్రతిపాదనలు పంపితే.. గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. వీటితో పాటు పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు, 77 చెరువులకు హంద్రీ నీవా నీటిని ఎత్తిపోతలపై ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టి సారించాలి.

- కోడుమూరు పట్టణ జనాభా 45 వేలు దాటింది. దశాబ్దాలుగా వేధిస్తున్న తాగునీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ నిర్మిస్తామని ఎన్నికల్లో స్పష్టమైన హామీ ఇచ్చారు. సాకారం కోసం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టి సారించాలి.
- ఎమ్మిగనూరు చేనేతలకు ఉపాధి లక్ష్యంగా బనవాసిలో మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేస్తామన్ని పాదయాత్రలో యువనేత లోకేశ్, ప్రజాగళం యాత్రంలో ప్రతిపక్ష నేతగా చంద్రబాబు స్పష్టమైన హామీ ఇచ్చారు. సాకారం కోసం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కృషి చేయాల్సిన అవసరం ఉంది.
- కర్నూలు నగర ప్రజల దాహం తీర్చేందుకు ప్రత్యేక పైపులైన్, అమృత్-2 కింద రూ.130 కోట్లతో జగన్నాథగట్టుపై 50 ఎంఎల్‌డీ, రూ.122 కోట్లతో తుంగభద్ర నది ఒడ్డున 35 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రాలు, 21 ఈఎస్ఎల్ఆర్ ట్యాంకులు పూర్తి చేయడం, నగరంలో ప్రధాన రహదారుల విస్తరణపై కర్నూలు, పాణ్యం ఎమ్మెల్యేలు మంత్రి టీజీ భరత్, గౌరు చరితలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.
- ఆదోని పట్టణంలో దశాబ్దాలుగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రధాన రోడ్ల విస్తరణ, శిథిలమైన పాతబస్టాండ్ రైల్వే ఫ్లైఓవర్ బిడ్జి పునర్నిర్మాణం, బైపాస్ రోడ్డు సమీపాన నల్లకొండ ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత భవనాలు నిర్మాణంపై ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం

ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 18: తపాలా కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలని ఎన్ఎఫ్‌పీఈ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే. ఈశ్వరయ్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులపై అధికారుల వేధింపులకు వ్యతిరేకంగా ఎన్ఎఫ్‌పీఏ రాష్ట్ర సమన్వయ కమిటీ, ఏఐజీడీఎస్‌యూ రాష్ట్ర సంఘాల అధ్వర్యంలో ప్రధాన తపాలా కార్యాలయంలో ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ ఏపీ సర్కిల్ పరిధిలో లక్ష్యాల పేరుతో అధికారులు చేస్తున్న వేధింపులు తారాస్థాయికి చేరాయన్నారు. వేధింపులను భరించలేక అనేక మంది ఉద్యోగులు అనారోగ్యంతో ఇంటిపట్టున ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐజీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి. లక్ష్మీకాంత్, పోస్టు మాస్టర్ క్లాస్-3 యూనియన్ డివిజనల్ కార్యదర్శి జి. గిరిబాబు, ఏ. లక్ష్మీకాంత రెడ్డి, చైతన్యమనోహర్‌రాజు, మహ్మద్‌జానీ తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ యూనిట్లకు సహకరించండి : జేసీ



కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకర్లు సహకరించాలని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య సంబంధిత బ్యాంకు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు స్కూటినీ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బ్యాంకర్ల నుంచి దరఖాస్తుదారులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలనీ ఎల్డీఎంను ఆదేశించారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం ద్వారా సొంతంగా యూనిట్ ఏర్పాటు చేసుకున్న వారికైనా, బ్యాంకుల నుంచి లోను తీసుకున్న వారికైనా 50 శాతం సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం రామచంద్రరావు, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంటు రాజమహేంద్రనాథ్, దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కో ఆర్డినేటర్ దిలీప్ పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు బదిలీ

కల్లూరు, సెప్టెంబరు 18: జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావును బదిలీ చేస్తూ రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీహెచ్ నాగలింగేశ్వరరావును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ చేయగా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. త్వరలో మరొకరిని జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అదేవిధంగా నంద్యాల జిల్లా రిజిస్ట్రార్ వి.చెన్నకేశవరెడ్డిని కర్నూలు జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా ఆడిట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.ఉమాదేవిని అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.

- డీఐజీ పీజీఎస్ కళ్యాణి కొనసాగింపు: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పీజీఎస్ కళ్యాణిని కర్నూలులోనే కొనసాగిస్తూ ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి బలవన్మరణం

- ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్ కంపెనీ మోసం
- సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య




సయ్యద్ ఖలీల్ అహమ్మద్ (ఫైల్)

నంద్యాల క్రైం, సెప్టెంబరు 18 : ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌కు సంబంధించిన ఓ కంపెనీ మోసం చేయడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నంద్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఇస్మాయిల్ వివరాల మేరకు.. నంద్యాల పట్టణంలోని సలీం నగర్‌కు చెందిన సయ్యద్ ఖలీల్ అహమ్మద్ అవుకు మండలం సంగపట్నం జడ్పీహెచ్ పాఠశాలలో హిందీ పండిట్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆగస్టులో ఆన్‌లైన్ యాప్‌కు సంబంధించిన టైటన్ ఎఫ్ ఎక్స్ డాట్ వీకే కంపెనీ నుంచి తనకు ఫోన్ వచ్చింది. తన కంపెనీలో పెట్టుబడిపెడితే పది శాతం కమీషన్‌తో మంచి లాభాలు వస్తాయని నమ్మబలికారు. కమీషన్‌తోపాటు బోనస్ కూడా ఇస్తామని చెప్పడంతో ఖలీల్ అహమ్మద్ తన భార్య పేరుమీద ఆ కంపెనీలో ఖాతాను ఓపెన్ చేశారు. కంపెనీలో లాభాలు గడించిన ఇతర ఖాతాదారుల వివరాలు ఖలీల్‌కు చూపించడంతో నిజమేనని నమ్మి రూ.1.50 లక్షల నగదును డిపాజిట్ చేశారు. ఖలీల్ డిపాజిట్‌కు రూ.7 లక్షలు కమీషన్ వచ్చిందని, ఆ కమీషన్‌ను డ్రా చేసుకోవాలంటే రూ.50 వేలు జమ చేయాలని చెప్పారు. దీంతో సెప్టెంబరు 5న రూ.50 వేలు వారి ఖాతాలో జమ చేశారు. ఐటీ, జీఎస్టీ తదితర పన్నులు కడితేనే పూర్తి మొత్తంలో నగదు వస్తుందని చెప్పడంతో విడతలవారీగా సెప్టెంబరు 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రూ.8.50 లక్షలు వారి ఖాతాకు జమ చేశారు. చివరకు కంపెనీ నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గుర్తించారు. దీనికితోపాటు నూతనంగా ఇంటిని నిర్మించుకోవడంతో వచ్చే జీతం బ్యాంకు లోన్‌కే సరిపోతోంది. దీంతో చేతిలో డబ్బులేక ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. ఎవరికి చెప్పుకోలేక అర్థంగాక మంగళవారం రాత్రి సెల్ఫీ వీడియోలో తాను మోసపోయిన ఉదంతాన్ని చెప్పి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. టూ టౌన్ సీఐ ఇస్మాయిల్, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నగరాన్ని అభివృద్ధి చేస్తా

- డ్రైనేజీ, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
- నగర పాలక నూతన కమిషనర్ రవీంద్రబాబు



కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 18: నగర పాలక సంస్థ కమిషనర్‌గా గతంలో రెండు పర్యాయాలు పని చేసిన అనుభవంతో కర్నూలును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని నూతన కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థతో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. నగరానికి రెండు ముఖ్యనదులతో పాటు కేసీ కెనాల్ కూడా ఉందన్నారు. వీటిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనిషి జీవన విధానం మారుతుం దన్నారు. దీని కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని తీసుకువచ్చాయన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక డ్రైడ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా మహాత్మాగాంధీ ఆశయాలను ముందుకు తీసుకపోవడానికి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో భా గంగా అధికారులు, ఉద్యోగులు కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ రంజిత్‌బాషాను కమిషనర్ రవీంద్రబాబు కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.

సింగిల్ డెస్క్ విధానంతో పరిశ్రమలకు అనుమతులు



మాట్లాడుతున్న జోనల్ మేనేజర్ సోమశేఖరరెడ్డి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 18 : ఉమ్మడి జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పే వారికి సింగిల్ డెస్క్ విధానంతో అన్ని రకాల అనుమతులు మంజూరు చేయనున్నట్లు ఏపీఐఐసీ ఉమ్మడి జిల్లా జోనల్ మేనేజర్ సోమశేఖరరెడ్డి తెలిపారు. బుధవారం కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొలిమిగుండ్ల సమీపంలో ఇటిక్యాల పరిధిలో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలని కోరా. నంద్యాల జిల్లా ఇటిక్యాలతో పాటు, జగదుర్తి, తంగడంచ గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మైక్రో, స్మాల్, మీడియం(ఎంఎస్ఎంఈ) ఎంటర్‌ప్రైజెస్ పట్ల యువకులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధి చేసిన స్థలాన్ని పరిశ్రమలు నెలకొల్పే వారికి విక్రయిస్తుందని అన్నారు. అనుమతులన్నీ ఆన్‌లైన్ ద్వారానే లభిస్తాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు మాత్రం 50శాతం రాయితీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ మాధవీలత, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి, ఎంపీడీవో ప్రసాదరెడ్డి, ఏపీవో గంగన్న తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ముగిసిన కళా ఉత్సవాలు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు18: ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి నవోదయ విద్యాలయంలో ప్రారంభమైన కళా ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ ఈ కళా ఉత్సవాల్లో 16 నవోదయ విద్యాలయాల నుండి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రెండో రోజు 8 విద్యాలయాల విద్యార్థులు పాల్గొని తమ నృత్య ప్రదర్శనలు ప్రదర్శించారన్నారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులు కేరళలోని కోజికోడ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టర్లు, విద్యాలయ అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ దాడి

నలుగురికి గాయాలు



గాయపడ్డ టీడీపీ వర్గీయుడు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు18: ఎమ్మిగనూరు మండల పరిధిలోని మసీదుపురం గ్రామంలో టీడీపీ వర్గీయులపై వైసీపీ వర్గీయులు దాడి చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వైసీపీకి చెందిన కురువ బుడ్డ అంజినయ్య, కురువ నరసింహులుతో పాటు మరో ఎనిమిది మంది టీడీపీకి చెందిన అంజినయ్య, బోయ మోకాశి నరసింహులు, రవి, లక్ష్మీనరసమ్మ పత్తి బస్తాలను నింపుతుండగా వ్యక్తిగత కక్షతో కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ వర్గీయులకు గాయాలయ్యాయి. బాధితుడు బోయ మోకాశి నరసింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కురువ బుడ్డ అంజినయ్య, కురువ నరసింహులతో పాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఇద్దరు యూట్యూబర్లపై కేసు నమోదు

ఆదోని, సెప్టెంబరు 18 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇద్దరు యూట్యూబ్ చానెల్ పేరుతో వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది విధులకు ఆటంకం కలిగించారని, ఆసుపత్రిలో ఉన్న రోగులకు ఇన్ఫెక్షన్ అయ్యే అవకాశం ఉండటం వల్ల ఆ వ్యక్తులపై ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. యూట్యూబ్ చానెల్‌కు చెందిన గౌస్, ఖాజా అనే వ్యక్తులు విధులకు ఆటంకం కలిగించడంతోపాటు బెదిరింపులకు దిగడం, ఎలాంటి అనుమతి లేకుండా ఆసుపత్రిలోకి వచ్చి రోగులను ఇబ్బందికి గురి చేసి వీడియోలు తీయడం, స్టోర్ రూమ్‌లోకి అనుమతులు లేకుండా వెళ్లి వీడియోలు తీయడం మొదలైన పనుల తో వైద్యుల విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ శ్రీరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యూట్యూబ్ నిర్వాహకులపై 353, 506, 448 ఐసీపీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామ్ తెలిపారు.

తెలుగుగంగ 28వ బ్లాక్ చానెల్‌లో పడి చిన్నారి మృతి



షేక్ రజియా మృతదేహం

రుద్రవరం, సెప్టెంబరు 18 : తెలుగుగంగ 28వ బ్లాక్ చానెల్‌లో పడి బుధవారం ఓ చిన్నారి మృతి చెందింది. ఆలమూరు తిప్ప గ్రామానికి చెందిన కమాల్‌బీ - రఫి దంపతుల రెండో కుమార్తె షేక్ రజియా స్థానిక ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. పాఠశాల వదిలిన తరువాత సాయంత్రం ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు గంగ 28వ బ్లాక్ చానెల్‌లో పడింది. తోటి చిన్నారులు స్థానికులకు సమాచారం ఇవ్వడంతో వారు రిజియాను వెలికితీసి ఓ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని చెప్పారు. రఫి గడేకారి పనికి, తల్లి కమాల్‌బీ పొలం పనులకు వెళ్లారు. బిడ్డ మృతి చెందిన విషయం తెలుసుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు.

● ఆలమూరు తిప్ప గ్రామానికి ఓ వైపు రోడ్డు, మరో వైపు తెలుగుంగ 28వ బ్లాక్ చానెల్ ఉన్నాయి. గ్రామం నుంచి విద్యార్థులు ఆలమూరుకు కాలిబాటన వెళ్లి చదువుకుంటున్నారు. గంగ కాల్వ రహదారి పక్కనే ఉండడంతో ప్రమాదాలు జరగకుండా కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కేసీ ఉప కాల్వలో పడి బాలుడు..

శిరివెళ్ల, సెప్టెంబరు 18 : శిరివెళ్ల మెట్ట సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద ఉన్న కేసీ ఉప కాల్వలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. శిరివెళ్ల మెట్ట వద్ద ఉన్న బుడగ జంగాల కాలనీకి చెందిన గురుమూర్తి కుమారుడు శంకరయ్య మంగళవారం మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు కేసీ ఉప కాల్వలో పడిపోయాడు. కుమారుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించారు. అనంతరం శంకరయ్య మృతదేహాన్ని బుధవారం ఉదయం కేసీ ఉప కాల్వలో గుర్తించారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు భోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేరించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్న పీరయ్య వెల్లడించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మూల రమణయ్య (ఫైల్)

పాములపాడు, సెప్టెంబరు 18: గత నాలుగు సంవత్సరాలుగా పంటలు సరిగా పండక అప్పులపాలై జీవితంపై విరక్తి చెంది మూల రమణయ్య (75) అనే రైతు వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని వేంపెంట గ్రామంలో జరిగింది. రమణయ్య నాలుగేళ్లుగా తన సొంత పొలం నాలుగు ఎకరాలతో పాటు మరో ఆరెకరాలు కౌలుకు తీసుకొని మిరప, మొక్కజొన్న పంటలను సాగు చేశాడు. వరుసగా వర్షాభావం వల్ల పంటలు రాక నష్టపోయాడు. కాస్తో, కూస్తో పండిన పంటలకు గిట్టుబాటు ధరలు రాలేదు. దీంతో దాదాపు 20 లక్షల మేర అప్పులు మిగిలాయి. రుణభారంతో తీవ్ర మనస్తాపానికి గురై గ్రామానికి సమీపంలో నిప్పులవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం బండి ఆత్మకూరు సమీపంలో కుందూ నదిలో శవం కనిపించింది. స్థానిక ఎస్ఐ జగన్‌మోహన్ మృతదేహాన్ని పంచనామాకు తరలించినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారులు లెనిన్‌బాబు, జయశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కేసులు

- జీపీఎస్ ద్వారా అడ్డుకుంటాం
- జిల్లాలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రెండు నెలల్లో 70 కేసులు.. రూ.33 లక్షల అపరాధ రుసుం వసూలు
- నేటి నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్ ప్రారంభం
- ఆంధ్రజ్యోతితో మైనింగ్ శాఖ డీడీ రాజశేఖర్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



కర్నూలు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మైనింగ్ శాఖ డీడీ రాజశేఖర్ ఆంధ్రజ్యోతితో అన్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ టీంఎం ఏర్పాటు చేస్తున్నామని, ఇసుక రవాణా చేసే టిప్పర్లు, ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు చేసి అక్రమ రవాణాను నిరోధిస్తామని అన్నారు. వాహనాలు సీజ్ చేయడమే కాకుండా బ్లాక్ లిస్టులో పెడుతామని అన్నారు. నేటి నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్‌కు శ్రీకారం చుడుతున్నామని, గ్రామ, వార్డు సచివాయాల్లో కూడా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చని ఆయన బుధవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఆ వివరాలు ఇలా..

● **ఆంధ్రజ్యోతి:** ఇసుక అక్రమ రవాణాను కరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు వివరిస్తారా..?

● **డీడీ రాజశేఖర్:** జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి వినియోగదారులకు ప్రభుత్వం నిర్ణయించిన రవాణా చార్జీలకే అందించే లక్ష్యంగా కలెక్టరు పి. రంజిత్ బాషా ఆదేశాలతో మైనింగ్, రెవెన్యూ, పోలీస్, రవాణా, ఇరిగేషన్ శాఖల అధికారులతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీంలను జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడ ఫిర్యాదు వచ్చినా తక్షణం స్పందిస్తాం. ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లు, టిప్పర్లకు జీపీఎస్ ఏర్పాటు చేస్తాం. తద్వారా అక్రమ రవాణాకు కళ్లెం వేస్తాం. ప్రభుత్వం థర్డ్ పార్టీ నిఘా పెట్టింది.

● జిల్లాలో ఎన్ని రీచ్‌లకు అనుమతి ఇచ్చారు. టీడీపీ కూటమి వచ్చాక ఎంత ఇసుకను వినియోదారులకు అందించారు?

● **డీడీ:** తుంగభద్ర నదిలో డీసిల్టేషన్ (బోట్ల ద్వారా ఇసుక తవ్వకం) రీచ్‌లు సి. బెళగల్ మండలం కె. సింగవరం, కొత్తకోట, ముడుమాల, ఈర్లదిన్నె, పల్లెదొడ్డి రీచ్‌లకు పర్యావరణ అనుమతులు ఉన్నాయి. ఈ రీచ్‌ల్లో ఇప్పటి వరకు 65 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు చేసి వినియోగదారులకు అందించాం. కౌతాళం మండలం మరళి, గుడికంబాలి, నదిచాగి గ్రామాల తుంగభద్రలో ఓపన్ ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేశాం.

● ఆన్‌లైన్ బుకింగ్ ఎలా చేసుకోవాలి. బుకింగ్ చేసుకున్న తరువాత ఎన్ని రోజులకు ఇసుక ఇస్తారు..?

● **డీడీ:** జిల్లాలో గ్రామ, వార్డు సచివాయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చు. ఆమేరకు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో కాకుండా బయట కూడా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవచ్చు. బుకింగ్ చేసుకున్న మరుసటి రోజు (24 గంటలు తరువాత) రీచ్‌ల్లో ఇసుక ఇస్తారు. ఏ రీచ్‌లో ఎంత ఇసుక అందుబాటులో ఉందో ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. నేటి నుంచి ఆన్‌లైన్ బుకింగ్‌కు శ్రీకారం చుడుతున్నాం. అందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేశాం.

● టిప్పరు యజమానులు సిండికేట్‌గా ఏర్పడి అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. దీనిని ఎలా నిరోధిస్తారు..?

● **డీడీ:** రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుంది. రాయల్టీ, లోడింగ్ చార్జీ, రవాణా చార్జీలు మాత్రం వినియోగదారులు చెల్లించాలి. జీవో నంబరు 52 ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విధానం రవాణా చార్జీలు నిర్ణయించారు. ఆ చార్జీలకు మించి వసులు చేస్తే నేరం అవుతుంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారించి వాస్తవమని తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. వాహనాలు సీజ్ చేసి బ్లాక్ లిస్టులో పెట్టి ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వం. ఈ విషయంలో ప్రభుత్వం చాలా స్పష్టంగా ఉంది. దీనిపై వినియోగదారులు కూడా అవగాహన పెంచుకోవాలి. అధికంగా అమ్మకాలు చేస్తే టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు లేదా రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా తక్షణమే స్పందిస్తాం.

● ఉమ్మడి జిల్లాలో ఈ రెండు నెలల్లో అక్రమ మైనింగ్‌పై ఎన్ని దాడులు చేశారు..? ఎంత అపరాధ రుసుం వసులు చేశారు..?

● **డీడీ:** ఉమ్మడి జిల్లాలో ఇసుక, ఎర్రమట్టి, రోడ్ మెటల్ (కంకర), నాపరాయి.. వంటి అక్రమ మైనింగ్, రవాణాపై వచ్చిన ఫిర్యాదులు ఆధారంగా, ఆకస్మిక తనిఖీలు చేశాం. ఆగస్టు నెలలో 50 కేసులు నమోదు చేసి అక్రమార్కుల నుంచి రూ.19 లక్షలు, ఈ సెప్టెంబరు నెలలో ఇప్పటి వరకు 20 కేసులు నమోదు చేసి రూ.14.23 లక్షలు అపరాధ రుసుం వసులు చేశాం. ఎక్కడైనా అక్రమ మైనింగ్ జరుగుతుంటే నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

వైభవంగా సీమోల్లంఘన ఉత్సవం

● 48 రోజుల దీక్షను ముగించిన సుబుదేంద్రతీర్థులు ● పీఠాధిపతికి నాణేలతో తులాభారం



పీఠాధిపతికి పుష్పాలతో స్వాగతం పలుకుతున్న ప్రజలు

మంత్రాలయం, సెప్టెంబరు 18: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సీమోల్లంఘన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి కొండాపురం ఆంజనేయస్వామిని దర్శించుకొని పంచ అశ్వవాహన రథంపై పీఠాధిపతి ఊరేగారు. గత నెల 2వ తేదీ నుంచి సెప్టెంబరు 18 వరకు 48 రోజుల పాటు మంత్రాలయం సరిహద్దులు దాటకుండా చాతుర్మాసదీక్షను పీఠాధిపతి కొనసాగించారు. దీక్ష విరమణలో భాగంగా శ్రీమఠం ఎంప్లాయిస్ యూనియన్, విజయ విఠల షాపింగ్ కాంప్లెక్స్, పీఎంపీఆర్ షాపింగ్ కాంప్లెక్స్, నదితీరం షాపింగ్ కాంప్లెక్స్‌లకు సంబంధించినవారు పీఠాధిపతికి పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించారు.

పీఠాధిపతికి నాణేలతో తులాభారం

సీమోల్లంఘనలో భాగంగా శ్రీమఠం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రవికులకర్ణి, ఐపి నరసింహమూర్తి,



పీఠాధిపతికి తులాభారంలో పాల్గొన్న ఉద్యోగులు

అనంతపురాణిక్, జేపీ స్వామి, విజేంద్రాచార్ పీఠాధిపతులకు నాణేలతో తులాభారం చేశారు. బుధవారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో ప్రత్యేక వేదికపై తులాభారంలో ఒక వైపు పీఠాధిపతిని ఉంచి, మరో వైపు నాణేలతో తూగించారు. అనంతరం పుష్పాభిషేకం చేసి పట్టువస్త్రం కట్టి, 50 గ్రాముల బంగారు బిళ్లను బహూకరించారు. 48 రోజుల దీక్షల్లో 60 ఉపన్యాసాలు, 20 సంగీత కచేరీలు విజయవంతంగా నిర్వహించారు. ఈ ఊరేగింపులో టీటీడీ దాససాహిత్య భజన మండళ్లు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, ఏఏవో మాధవశెట్టి, రాజాఎస్ అప్రమేయాచార్, మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ఐపి నరసింహమూర్తి, బీఎం ఆనందరావు, అనంతపురాణిక్, రమణారావు, వాదిరాజాచార్, సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, హరినాథాచార్ ఉన్నారు.

వీడిన అనుమానాస్పద మృతి కేసు

ఆత్మహత్యగా చిత్రీకరించిన నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ

ఆత్మకూరు, సెప్టెంబరు 18: అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. బుధవారం నిందితులను అరెస్టు చేసి మీడియా ఎదుట హాజరుపరిచారు. ఆత్మకూరు డీఎస్పీ ఆర్.రామాంజీనాయక్ ఆ వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు మండలం కరివేన గ్రామానికి చెందిన బోయ మధు సురేష్ (26) అదే గ్రామానికి చెందిన బరిగెల సంసోన్ భార్య పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడు. ఫోన్‌లో వేధించేవాడు. సంసోన్ మందలించినా అతడిలో ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో మధుసురేష్‌ను హత మార్చాలని సంసోన్ నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే తన సోదరుడు బరిగెల రాజేష్‌తో కలిసి ఈ ఏడాది జూలై 31 రాత్రి మధుసురేష్‌ను బైక్‌పై ఎక్కించుకున్నారు. కరివేనలోని సంసోన్ పొలానికి తీసుకెళ్లారు. అక్కడ మధుతో గొడవ పడి బండరాయితో హత్య చేశారు. అయితే నేరం బయటకు పొక్కకుండా ఉండేలా అతని మృతదేహాన్ని పాములపాడు పోలీసుస్టేషన్ పరిధిలోని భానుముక్కల శివార్లలో గల ఈదుల వాగులో పడేశారు. మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న మధుసురేష్ ఎక్కడైనా పడి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానించారు. నాలుగు రోజుల తర్వాత ఈదుల వాగులో మృతదేహం లభ్యమైంది. అనుమానాస్పద మృతిగా పాములపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్, పాములపాడు ఎస్ఐ సురేష్‌బాబు తనదైన శైలిలో విచారణ చేపట్టారు. ఇరువురు నిందితులు బుధవారం కరివేన వీఆర్వో శంకర్‌రెడ్డి వద్ద లొంగిపోయారు. దీంతో పోలీసులు వారిని ఆత్మకూరు కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.

రికార్డు స్థాయిలో రోగులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 18: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ఈ నెల 17వ తేదీ రికార్డు స్థాయిలో 3470 మంది ఓపీ రోగులు వచ్చారు. సీజనల్ వ్యాధులు ప్రబలడంతో రోగుల సంఖ్య పెరిగింది. ఓపీలో పాత రోగులు 828 మంది, కొత్త రోగులు 2642 మంది వచ్చారు. వీరిలో 277 మంది ఆసుపత్రిలో వివిధ జబ్బులతో అడ్మిషన్ పొందారు. సాధారణంగా సాధారణ ఓపీ రోగులు 2500 నుంచి 3000 వరకు నమోదవుతుంటారు. కానీ సీజనల్ వ్యాధుల కారణంగా రోగుల సంఖ్య 3470కి చేరినట్లు అధికారులు వెల్లడించారు.

ఎల్లార్తి హుండీ లెక్కింపు

హొళగుంద, సెప్టెంబరు 18 : ఎల్లార్తి హజరత్ షేక్షావలి, షాషావలి సాహెబ్‌ల దర్గా హుండీ లెక్కింపును వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ సుహైల్... వక్ఫ్‌బోర్డు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పర్వీన్, ఈవో ఇమ్రాన్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సుహైల్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు నెలల హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే స్థానిక సర్పంచుకుగాని, ప్రజలకు గానీ కనీస సమాచారం కూడా ఇవ్వకుండా లెక్కింపు కార్యక్రమం చేపట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.దర్గాకు సంబంధించిన రెండు ఇరుకు గదుల్లో హుండీ లెక్కింపు నిర్వహించడంపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సుహైల్‌ను వివరణ కోరగా పోలీసుల సమక్షంలో లెక్కింపు నిర్వహించామని తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గడివేముల, సెప్టెంబరు 18: చికిత్స పొందుతూ బుధవారం ఓ యువకుడు మృతి చెందాడు. మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన మనోహర్ (23) మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగవద్దని తల్లి మంగమ్మ మందలించడంతో ఈ నెల 17న పురుగుల మందు తాగాడు. బంధువులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

కోడలిపై మామ దాడి

కేసు నమోదు

సంజామల, సెప్టెంబరు 18: కోడలిపై మామ దాడికి పాల్పడిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య మంగళవారం తెలిపారు. వసంతాపురం గ్రామానికి చెందిన గుంతమండ్ల శిఖామణి తన కోడలు ఉమాదేవిని దూషించి కాళ్లు, చేతులతో కొట్టి హింసించడంతో కేసు నమోదు చేశామన్నారు. ఉమాదేవి భర్త మద్దిలేటి నంద్యాల రైల్వేలో పని చేస్తున్నాడని, వారానికి ఒకసారి వచ్చిపోతూ వసంతాపురం గ్రామంలోనే కాపురం పెట్టాడని తెలిపారు. ఈ నేపథ్యం మామ తరచూ ఉమాదేవిని అసభ్యకరంగా మాట్లాడుతుండటంతో పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఇనుప కడ్డీల కోసం వెళ్లి కేసీలో గల్లంతు

కర్నూలు, సెప్టెంబరు 18: వినాయక నిమజ్జనం సందర్భంగా విగ్రహాలకు ఉండే ఇనుప కడ్డీలను తెచ్చుకునేందుకు వెళ్లి భీముడు (40) అనే వ్యక్తి కేసీలో గల్లంతయ్యాడు. బిర్లా గడ్డకు చెందిన భీముడు సెంట్రింగ్ పని చేస్తుంటాడు. ఈ నెల 16న కేసీ కెనాల్‌లో ఉన్న వినాయక విగ్రహాలకు ఉన్న కడ్డీలను తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పాడు. ఆ తర్వాత ఇంటికి రాలేదు. బుధవారం సాయంత్రం జొహరాపురం బ్రిడ్జి సమీపంలో నీటిలో శవమై తేలుతూ కనిపించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మూడో పట్టణ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీకి తరలించారు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

పర్సు కత్తిరించి నగదు చోరీ

కర్నూలు, సెప్టెంబరు 18: ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం క్యూలైన్‌లో నిల్చుండగానే పర్సులోని నగదును ఓ కిలాడి లేడీ అపహరించింది. టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. బుధవారపేటకు చెందిన జయమ్మ అనే మహిళ ఆధార్ అప్‌డేట్ కోసం పోస్టాఫీసుకు వెళ్లింది. లైన్‌లో నిల్చుండగా.. ఓ యువతి తాను కూడా అప్‌డేట్ కోసం వచ్చానని లైన్‌లో నిల్చోవాలని అటు ఇటూ తిరిగింది. కొద్దిసేపటి తర్వాత జయమ్మ పర్సు మొత్తం కత్తిరించింది. అందులో ఉన్న రూ.8వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి సీసీ కెమెరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల్లో అక్కడకు వచ్చి అంతసేపు తిరుగుతున్న ఆ యువతే ఈ నగదును తస్కరించినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ వెంకటరమణకు డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి



కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 18: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏఆర్ఎంవోగా పని చేస్తున్న డా. టీసీహెచ్ వెంకటరమణ డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డా.కే. పద్మావతి, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఉన్న ఆయనకు కౌన్సెలింగ్‌లో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి కర్నూలు మెడికల్ కాలేజీ ఎస్పీఎం డిపార్టుమెంటులో పోస్టింగ్ వేశారు. పదోన్నతి పొందిన ఆయన 15 రోజుల్లో విధుల్లో చేయాలని డైరెక్టర్ ఆదేశించారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ఆయనను రిలీవ్ చేయగా.. బుధవారం మధ్యాహ్నం కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మకు రిపోర్టు చేశారు. అనంతరం విధుల్లో చేరారు.

కారు బోల్తా : పదిమందికి గాయాలు



బోల్తా పడిన కారు

వెల్దుర్తి, సెప్టెంబరు, 18: మండలంలో మదార్‌పురం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి-44 పై ఇన్నోవా కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో పది మందికి తీవ్రగాయాల య్యాయి. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి (తారకరామ నగర్) చెందిన మంగలి పరమేష్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం క్రిష్ణగిరి మండలం పుట్లూరు మారెమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వెళ్లారు. పూజా కార్యక్రమాల అనంతరం వారు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో వెల్దుర్తి దాటిన తరువాత మాదార్‌పురం సమీపంలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో టైరు పగిలిపోయి పల్టీలు కొట్టుకుంటూ ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి ఎడమ పక్కన ఉన్న సర్వీసు రోడ్డుపై బోల్తా పడింది. గ్రామస్తులు, అటుగా వెళుతున్న వారు కారులో ఇరుక్కున వారిని అతికష్టం మీద బయటకు తీసుకువచ్చారు. హైవే పోలీసులు, స్థానిక పోలీసులు అక్కడకు చేరుకొని క్షతగాత్రులను హైవే అంబులెన్స్ 108 వాహనంలో వె ల్దుర్తి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. మోక్షిత్, వెంకటేశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

క్షతగాత్రులు వీరే... మంగలి రాఘవేంద్ర (డ్రైవర్), మంగలి పరమేష్, రామలింగం, వెంకటేశ్వరమ్మ, పార్వతమ్మ, మౌనిక, మోక్షిత్, జ్యోతి కారు ప్రయాణంలో గాయపడ్డారు. కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన శంకర్, ప్యాపిలి మండలం చిన్నహూజర్లకు చెందిన ప్రవీణ్ బైక్‌పై వెళ్తూ కారు వెనుక నుండి ఢీకొనడంతో గాయపడ్డారు.

పెద్దాసుపత్రికి విరాళంగా ఎక్స్‌రే క్యాసెట్లు

వైద్యులను అభినందించిన సూపరింటెండెంట్



సూపరింటెండెంట్‌కు ఎక్స్‌రే క్యాసెట్లను అందజేస్తున్న రేడియాలజీ వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 18: కర్నూలు మెడికల్ కాలేజీ రేడియాలజీ పూర్వ విద్యార్థులు, కర్నూలు రేడియాలజీ వైద్యుల సంఘం నాయకులు రూ.2.50 లక్షల విలువ చేసే ఐదు ఫ్యూజీ కంపెనీకి చెందిన ఐదు ఎక్స్‌రే డిజిటల్ క్యాసెట్లు (సీఆర్) విరాళంగా అందించారు. ఈ మేరకు బుధవారం క్యాసెట్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ సి. ప్రభాకర్ రెడ్డికి రేడియాలజీ విభాగపు హెచ్‌వోడీ డాక్టర్ పద్మలత, సీనియర్ ప్రొఫెసర్ రాధారాణి, సీనియర్ రేడియాలజిస్టు జోజిరెడ్డి, అనంతపురం జీజీహెచ్ రేడియాలజీ హెచ్‌వోడీ సురేష్, కర్నూలు రేడియాలజీ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ విజయకుమార్, రేడియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ హరినాథ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రేడియాలజిస్టులు డాక్టరు అశోక్, హనీఫ్, రవితేజ, చీఫ్ రేడియోగ్రాఫర్ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

అధికారులతో కమిషనర్ సమీక్ష

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 18: నగర పాలక ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగాల అధికారులతో కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సమీక్షించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, పీపీపీ ప్రాజె క్టులు, అన్న క్యాంటీన్లు నిర్మాణం, పారిశుధ్యం, స్వచ్ఛతా హి సేవ కార్యక్ర మాల కారాచరణ వంటి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగేశ్వర్, ఆరోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి, ఎంఈలు శేష సాయి, షాకీర్, సెక్రటరీ నాగరాజు, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, సెప్టెంబరు 18: నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు నేపథ్యంలో (132-33కేవీ) గూడురు సబ్‌స్టేషన్ పరిధిలోని కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ సుబ్బన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం కే.మార్కాపురం, పెద్దకొట్టాల, చిన్నకొట్టాల, సల్కాపురం, నెరవాడ గ్రామాల్లో తెల్లవారుజామున 3 గంటల నుంచి 9 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు త్రీఫేస్ సప్లయ్ ఇస్తామన్నారు. సల్కాపురం, నెరవాడలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 18: గూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల నుంచి కాండోనేషన్ ఫీజులు వసూలు చేసిన ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్ డిమాండ్ చేశారు. డీవీఈవో పరమేశ్వరరెడ్డికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సాయి ఉదయ్ మాట్లాడుతూ విద్యార్థులకు కాండోనేషన్ ఫీజు తిరిగి ఇవ్వాలని కోరారు. ఒకవేళ విద్యార్థుల డబ్బులు తిరిగి ఇవ్వకపోతే ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. డీవీఈవోకు వినతి సమర్పించిన వారిలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు చింటు, ఆర్యన్ పాల్గొన్నారు.

చిన్న రామకృష్ణ మృతికి సంతాపం

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 18: ఆలూరు తాలూకా సీపీఐ నాయకుడు చిన్న రామకృష్ణ మృతికి ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. చిన్న రామక్రిష్ణ పార్టీ నిర్వహించిన భూ పోరాటాల్లో చురుకుగా పని చేశారని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు.

పేదలకు విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న షాబీర్‌బాషా

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 18: పేద విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్యను రాష్ట్ర ప్రభుత్వం దూరం చేస్తున్నదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, షాబీర్ బాషా అన్నారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు గుప్పిట్లోకి తీసుకెళ్లాలనే ఆలోచనలు కనిపిస్తున్నాయని, గుజరాత్ తరహాగా పీపీపీ విధానానికి ఎన్డీయే కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని విమర్శించారు. ఇదే జరిగితే.. మొత్తం రిజర్వేషన్ల వ్యవస్థకు తూట్లు పడే ప్రమాదం ఉందన్నారు. జీవో.107, 118 రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు ఏకంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పనుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో మధు, రాము, అఖిలేష్, సుధీర్, వీరేష్ పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థులకు చెప్పుల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 18: నగరంలోని ఆదర్శ లెప్రసీ కాలనీలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ బుధవారం కుష్ఠ వ్యాధిగ్రస్థులకు మైక్రో సెల్యూలర్ రబ్బర్ (ఎంసీఆర్) చెప్పులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కుష్ఠ వ్యాధిగ్రస్థులకు సాధారణంగా స్పర్శ లేకపోవడం వల్ల వేడి తగిలినా, ముల్లులు గుచ్చు కున్నా పాదాలకు గాయాలు అవుతాయన్నారు. అందువల్ల ఎంసీఆర్ చెప్పులు ఉచితంగా ఇచ్చామన్నారు. కార్యక్రమంలో టీహెచ్ వార్డు వైద్యాధికారి డా.శ్రీదేవి, యుపీహెచ్‌సీ వీకర్ సెక్షన్ కాలనీ వైద్యాధికారి డా.శ్రీరాములు, ఫిజియోథెరపిస్టు రెడ్డిబాబు, డీపీఎంవో నారాయణరావు, సుబ్రహ్మణ్యం, ప్రకాష్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కల్లూరు, సెప్టెంబరు 18: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని పర్ల పాఠశాల కమిటీ చైర్మన్ వి. సరోజ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎం సత్య నారాయణ, ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల ఆటల పోటీలు నిర్వహించారు. ఈమేరకు ఎంఈఓ ముఖ్య అతిథిగా హాజరై కబడ్డీ, చెస్, వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ చైర్మన్ గిడ్డయ్య, సర్పంచు హనుమక్క, ఎంపీటీసీ మేకల శేషన్న, మాజీ సర్పంచు శేఖర్, మహానంది ఆయా పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

మఠం మేనేజర్‌గా వెంకటేశ్ జోషి

మంత్రాలయం, సెప్టెంబరు 18: మఠం మేనేజర్-ఏగా వెంకటేశ్‌జోషికి బాధ్యతలు అప్పగిస్తూ పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఆదేశాలు జారీ చేసినట్లు ఏఏవో మాధవశెట్టి బుధవారం తెలిపారు. మూడురోజుల క్రితం మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మేనేజర్-బీగా ఉన్న వెంకటేశ్‌జోషికి అదనపు బాధ్యతలు అప్పగించారు.



కార్మికుల సంక్షేమమే ప్రధాన అజెండా

9 తీర్మానాలకు నగర పాలక స్టాండింగ్ కమిటీ ఆమోదం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మేయర్, సభ్యులు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 18: నగర పాలక సంస్థలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమమే ప్రధాన అజెండాగా నగర పాలక స్థాయి సంఘ సమావేశం నిర్వహించినట్లు మేయర్ బీవై రామయ్య తెలిపారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సభ్యులు, అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో 9 తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. సాధారణ నిధుల నుంచి రూ.1,67,18,000 కోట్ల నిధుల వినియోగానికి స్థాయి సంఘం ఆమోదముద్ర వేసింది. నగర పాలక కార్పొరేటర్లు, అధికారులు, రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు బీమా వర్తించేలా రూ.520తో జీవిత బీమా చేయడానికి ఆమోదం తెలిపారు. రూ.45.50 లక్షలతో కార్మికులకు దుస్తులు, నూనె, సబ్బులు సరఫరా చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కార్యక్రమంలో సభ్యులు విక్రమసింహారెడ్డి, యూనుస్‌బాషా, జుబేర్ అహ్మద్, క్రాంతికుమార్, మిద్దె చిట్టెమ్మ, ఆరోగ్య అధికారి కే. విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ డి. వేణుగోపాల్, మేనేజర్ చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

● **ప్రజాధనం వృథా..** నగర పాలక నిధులతో పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య బీమా చెల్లించాలనే ఉద్దేశంతో స్టాండింగ్ కమిటీ ఎజెండాలో పొందుపరిచారు. అయితే కార్మికులకే కాకుండా రెగ్యులర్ ఉద్యోగులకు, కార్పొరేటర్లకు కూడ ఆరోగ్య బీమా నగర పాలక సంస్థ చెల్లించేలా కమిటీ సమావేశంలో తీర్మానం చేశారు. ప్రధానంగా రెగ్యులర్ ఉద్యోగులు, అధికారులు, కార్పొరేటర్లకు ఆరోగ్య బీమా చెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం స్టాండింగ్ కమిటీలో వైసీపీకి చెందిన మేయర్, కార్పొరేటర్లు ఉండటంతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. అధికారులు, ఉద్యోగుల మెప్పుకోసమే ప్రజాధనాన్ని వృథా చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ప్రధానంగా నగర పాలక కార్యాలయంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ఆరోగ్యబీమాను నగర పాలక నిధులతో చెల్లించవచ్చు. అయితే రెగ్యులర్ ఉద్యోగులకు, కార్పొరేటర్లకు చెల్లించాల్సిన అవసరం లేదు. కేవలం వైసీపీకి చెందిన కార్పొరేటర్లు అధిక సంఖ్యలో ఉండటంతో పాటు స్టాండింగ్ కమిటీలో ఐదుగురు సభ్యులు వైసీపీకి చెందినవారే ఉన్నారు. దీంతో ఆడిందే ఆటగా..పాడిందే పాటగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగర పాలక సంస్థలో రెగ్యులర్ ఉద్యోగులకు సుమారు 400 మందికి పైగా ఉంటారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్కరికి రూ.520 చొప్పుల 400 మందికి రూ.2,08,000 అవుతుంది. దీంతో పాటు కార్పొరేటర్లు 51 మంది ఉన్నారు. ఒక్కొక్కరికి రూ.520 చొప్పున 51 మందికి రూ.26,520 నిధులను ఖర్చు చేస్తున్నది. నగర పాలక నిధులను ఇలా చెల్లించుకుంటూ పోతే ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సౌకర్యాల మాటేమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నుల నుంచి ఉద్యోగులకు, కార్పొరేటర్లకు బీమా చెల్లించడం ఎంత వరకు సమంజసమనే విమర్శ వినిపిస్తున్నది.

ఘనంగా ఎమ్మెల్యే కోట్ల జన్మదిన వేడుకలు



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 18: జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కోడుమూరు తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వంశీధర్‌రెడ్డి, కోడుమూరు తెలుగు యువత అధ్యక్షుడు సీబీ ఆదిత్యారెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్, డి.నాగరాజు యాదవ్, సుధాక ర్‌రెడ్డి, ఆకెపోగు వెంకటస్వామి, ధరూర్ జేమ్స్, సత్రం రామక్రిష్ణుడు, బజారన్న, షేక్షావలి, విజయకుమార్ పాల్గొన్నారు.

గూడూరు: పట్టణంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బుధవారం గూడూరులో కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు చెట్టుకింది సురేష్, నారాయణ, అయ్యవారి నాయుడు, సంఘాల మధు, రేవుల గోవిందు, ఉప్పరి లక్ష్మన్న పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధికి హుశేనాపురం గ్రామం తరపున సోల్జర్స్ అసోసియేషన్ సభ్యులు సలాంఖాన్, నరేష్‌లు విరాళంగా రూ.40 వేలు చెక్కును కలెక్టర్ రంజిత్ బాషాకి అందజేశారు. ఈసందర్భంగా వారిని కలెక్టర్ అభినందించారు.

బీసీ భవన్‌కు రూ.2 కోట్ల నిధులు

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 18: జిల్లా బీసీ భవన్ నిర్మాణం కోసం రూ.2 కోట్ల నిధులు కేటాయించడంపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీ క్యాంప్ బీసీ భవన్‌లో చంద్ర బాబు చిత్రపటానికి బీసీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో బీసీలందరికీ న్యాయం జరిగేటట్లు రూ.200 కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. అన్ని జిల్లాల బీసీ భవన్‌లను తక్షణమే నిర్మించాలని తీర్మానించామన్నారు. కార్యక్రమంలో నాయకులు వలసల రామకృష్ణ, మురళీ మనోహర్, వెంపేంట రాంబాబు, విజయకుమార్, సత్రం రాకృష్ణుదు, సుభాస్ చంద్రబోస్ పాల్గొన్నారు.

బీసీల హామీ అమలుపై హర్షం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 18: ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీని అమలు చేసిన సీఎం చంద్రబాబుకు ఎస్సీ సెల్ నగర ప్రధాన కార్యదర్శి కాశపోగు గిడ్డన్న హర్షం వ్యక్తం చేశారు. బుధవార నగరంలోని మౌర్యఇన్ వద్ద నగర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పిస్తామని హామీని ఆమలు చేయడం, మంత్రి మండలిలో ఆమోద ముద్ర వేయడం చారిత్రక విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీధర్, దేవరాజ్, నాగరాజు అన్వర్ బాషా పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించండి: డీవీఈవో

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 18: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో రాణించాలని డీవీఈవో పరమేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో స్కూల్‌గేమ్స్+2 టేబుల్‌టెన్నిస్ ఎంపిక పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ప్రతి రోజు ఒక గంట క్రీడలకు కేటాయించాలని ఆయన తెలిపారు. క్రీడలు విద్యను, సమానంగా స్వీకరించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. ఇంటర్మీడియట్ విద్యలో క్రీడలకు పెద్ద పీట వేయాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ గ్రేమ్స్+2 కార్యదర్శి భూపతిరావు, పీడీలు నరసప్ప, నాగేషుడు, రామ్‌దేవ్, కిరణ్ పాల్గొన్నారు.

● **నేడు మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు :** డీఎస్ఏ స్టేడియంలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు గేమ్స్ కోఆర్డినేటర్ పీడీ పుల్లన్న తెలిపారు. స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల టోర్నమెంటు కం సెలక్షన్ ఉంటుందన్నారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్, బ్యాడ్మింటన్ అథ్లెటిక్స్ క్రీడాంశాలలో బాలబాలికలకు మండల స్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని ఆయన తెలిపారు.

21న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 18: డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఈ నెల 21న ఉదయం 10 గంటలకు అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు ఉమ్మడి కర్నూలు జిల్లా స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా, కరాటే ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.గిడ్డయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపిక పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు గౌరు చరిత, దస్తగిరిలను ఆహ్వానించామని తెలిపారు.

నేడు క్రీడా పోటీలకు ఎంపిక

ఓర్వకల్లు, సెప్టెంబరు 18: ఓర్వకల్లులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బాలబాలికల అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో, చెస్ క్రీడా పోటీల టోర్నమెంటులో ఎంపికలు ఉంటాయని ఎంఈవో ఓంకార్ యాదవ్ బుధవారం తెలిపారు. ఈ ఎంపికకు మండలంలోని ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలలోపు విద్యార్థినులతో హాజరు కావాలని ఆయన తెలిపారు.

నిరుద్యోగ వేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 18: వేద విద్యను అభ్యసించి నిరుద్యో గులుగా ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వ రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇచ్చేం దుకు ఆదేశాలు జారీ చేసిందని జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థులు వారి బయోడేటాను దేవదాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని ఆయన కోరారు.

అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు

సి.బెళగల్, సెప్టెంబరు 18: అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయశ్రీ వాహనాదారులను హెచ్చరించారు. బుధవారం మండలంలోని గ్రామాల్లోని వీఆర్వోలతో ఆమె మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎర్రమట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల యజమానులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.

కొత్త బస్టాండ్‌లో 'స్వచ్ఛతా హి సేవా'



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం

కర్నూలు(రూరల్), సెప్టెంబరు 18: కర్నూలు కొత్తబస్టాండ్ ప్రాంగణంలో బుధవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు హాజరై ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వుల మేరకు ఈనెల 17వ తేదీ నుంచి వచ్చే నెల ఒకటి వరకు జిల్లాల్లోని అన్ని డిపోలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు 1, 2 డిపో మేనేజర్లు సుధారాణి, సర్దార్ హుస్సేన్, ఆర్టీసీ యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కోడుమూరు: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని డీపీవో నాగరాజనాయుడు అన్నారు. పట్టణంలో చేపట్టిన పారుశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా డీపీవో మాట్లాడుతూ ప్రజలకు అందించే తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ఇంటింటా ప్రచారం చేపట్టి, రోడ్లపై వేసిన చెత్తను తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచు భాగ్యరత్న, ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోఆర్డీ మం జుల, పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్, శానిటేషన్ అధికారి వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకుడు అంద్రయ్య పాల్గొన్నారు.

ఓర్వకల్లు: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పను లు చేపట్టారు. ఓర్వకల్లులో ఈవోఆర్డీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో కాలనీల్లో డ్రైనేజీల్లో చెత్తను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

కల్లూరు: గ్రామ పంచాయితీల్లో పరిసరాల పరిశుభ్రతే ప్రధాన లక్ష్యమని కల్లూరు ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం కల్లూరు మండలంలోని చిన్నటేకూరు, పెద్దటేకూరు, బస్తిపాడు గ్రామాల్లో ఆయన స్వచ్ఛతాహీ సేవా ర్యాలీలో పాల్గొని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కాల్వలు శుభ్రం చేయాలని, మురుగునీరు ఆగకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. అలాగే బస్తిపాడు లేఅవుట్‌ను సందర్శించి గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఏపీడీ లక్ష్మన్న, ఎర్రమల, ఏపీఓ మద్దీశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

సి.బెళగల్: పంచాయతీలు పరిశుభ్రంగా ఉండేలా తీర్చిదిద్దాలనే స్వచ్ఛతే సేవ కార్యక్రమం లక్ష్యమని మండల ఈవోఆర్డ్ సందీప్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కంబంధహాల్ గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి అభిషేక్ అధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ సందీప్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛతే సేవ కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ర్యాలీ నిర్వహించి ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలని అన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కోడుమూరులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో



ఓర్వకల్లులో పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులు



కంబందహల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

విజయవాడ వరద బాధితులకు విరాళం

కల్లూరు, సెప్టెంబరు 18: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాలను టీడీపీ నాయకులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డికి అందజేశారు. బుధవారం మాధవీనగర్‌లోని స్వగృహంలో నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ రూ.లక్ష నగదును ఎమ్మెల్యే గౌరు చరితకు అందజేశారు. కల్లూరు మండలం కొంగనపాడు టీడీపీ నాయకు డు వినోద్ ఆధ్వర్యంలో రూ.1,25,000 నగదును గౌరు వెంకటరెడ్డికి అంద జేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగయ్య, గోరంట్ల, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గౌరు చరితకు రూ.లక్ష నగదును అందజేస్తున్న పార్వతమ్మ

జాతికి న్యాయం చేయండి

చంద్రబాబుకు బేడబుడగ జంగం నాయకుల వినతి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 18: బేడగ బుడగ జంగం కులానికి న్యాయం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు తూర్పాటి మనోహర్ కోరారు. బుధవారం అమరావతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వరద సహాయం చెక్‌ను అందజేసి, తమ జాతిని ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కులాన్ని షెడ్యూల్ కులాల రిజర్వేషన్ హక్కులు పొందేందుకు 2017లో జేసీ శర్మకమిషన్ ఏర్పాటు చేసి, కమిషన్ రిపోర్టును క్యాబినెట్ ఆమోదించి కేంద్ర ప్రభు త్వానికి పంపించిందని గుర్తు చేశారు. ఈ ఫైల్ కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉందని, తమ జాతి రిజర్వేషన్ సమస్యను తక్షణం పరిష్కరిం చాలని కోరారు.



సీఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

వ్యక్తి అదృశ్యం

కర్నూలు, సెప్టెంబరు 18: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిత్తారి వీధికి చెందిన కురువ మద్దిలేటి కనిపించకుండా వెళ్లినట్లు కేసు నమోదైంది. ఈయనకు భార్య, కొడుకు, కూతురు సంతానం. కూలి పని చేస్తూ జీవనం చేస్తుంటాడు. మంగళవారం ఆయన భార్య మహేశ్వరి పాతబస్టాండుకు వెళ్లి తిరిగి వచ్చేసరికి భర్త మద్దిలేటి కనిపించలేదు. బంధువుల ఇళ్లల్లో, స్నేహితుల వద్ద వెతికించినా కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామయ్య నాయుడు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులకు సైరన్లు, రేడియం జాకెట్ల పంపిణీ



బెల్లం పంపిణీ చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు, సెప్టెంబరు 18: ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా ఎస్పీ బిందు మాధవ్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. బుధవారం కొండారెడ్డి బురుజు వద్ద ట్రాఫిక్ మొబైల్స్ పోలీసులకు, పోలీసు సైరెన్లు, రేడియం జాకెట్లును ఎస్పీ అందించారు. అలాగే ట్రాఫిక్ మొబైల్స్ వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 14 ట్రాఫిక్ పోలీసు మొబైల్స్ వాహనాలకు పోలీసు సైరన్లు, రేడియం జాకెట్లు అందించామన్నారు. ట్రాఫిక్‌లో పొగ కాలుష్యంతో విధులు నిర్వహించే వారికి గొంతు ఇన్‌ఫెక్షన్ రాకుండా ప్రతి ఒక్కరికి 1కేజీ బెల్లం కూడా అందించామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, వన్‌టౌన్ సీఐ రామయ్య నాయుడు, ఆదోని వన్‌టౌన్ సీఐ శ్రీరామ్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ అహ్మద్ హుశేన్, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకుందాం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 18: ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జనవిజ్ఞాన వేదిక నాయకులు శివ శంకర్ గౌడ్, శేషాద్రి రెడ్డి, ప్రతాప్ రెడ్డి, మంజూరు బాషా అన్నారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పర్యావరణం, పరిశుభ్రత, శాస్త్రవిజ్ఞానం గురించి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్లాది ఎకరాల అటవీభూములను అభివృద్ధి పేరుతో ధ్వంసం చేస్తున్నారని ఫలితంగా జీవవైవిధ్యానికి, వృక్ష జంతు జల సంరక్షణకు తీరని నష్టం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు, నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి తోటల పరిశీలన

సి.బెళగల్, సెప్టెంబరు 18: ఉల్లి, మిరప, పండ్ల తోటలను కోడుమూరు ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌గౌడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాలతో ఉల్లి, మిరప, పండ్లతోటలు దెబ్బతిన్న పంటలను పరిశీలించామన్నారు. మండలంలోని కంబంధ హల్, ఇనగండ్ల, గుండ్రేవుల, కొండాపురం, పోలకలు, బ్రాహ్మణదొడ్డి, గూడూరు గ్రామాలలో రైతులు సాగు చేసిన ఆయా పంటల వివరాలను ఆయా గ్రామాలలోని హార్టికల్చర్ అసిస్టెంట్లతో మాట్లాడి రైతులు సాగు చేసిన పండ్లతోటల వివరాలు అడగంల్ ఫసలి నమోదు చేయాలన్నారు. సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట హార్టికల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, నాగన్న, రైతులు ఉన్నారు.

గ్రామాలకు వెళ్లండి

ఆదోని రూరల్, సెప్టెంబరు 18: కార్యదర్శులు గ్రామాలకు వెళ్లాలని వారం ఎంపీడీవో గీతావాణి సూచించారు. బుధవారం కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్లు



నిర్మల్ టాకీస్ ఎదురుగా సిద్ధమైన అన్న క్యాంటీన్

ఆదోని టౌన్, సెప్టెంబరు 18: పట్టణంలో అన్న క్యాంటీన్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. నిర్మల్ టాకీస్ ఎదురుగా, అంబేడ్కర్ విగ్రహం వెనుక, పాత ఫ్లైఓవర్ పక్కన ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వం క్యాంటీన్లను మూసివేయడంతో తిరిగి వీటిని కూటమి ప్రభుత్వం మరలా క్యాంటీన్లుగా మార్చింది. ఒక్కో క్యాంటీన్‌కు రూ.12 లక్షలు ఖర్చు చేసి ప్రారంభానికి సిద్ధం చేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ అనుపమ తెలిపారు. గురువారం ఎమ్మెల్యే పార్థసారథి ప్రారంభించనున్నారు.
ఎమ్మిగనూరు: పట్టణంలో రెండు క్యాంటీన్లను శుక్రవారం ఎమ్మెల్యే బీవీ ప్రారంభించనున్నట్లు కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబాలకు చెక్కు పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, అధికారులు

వెల్దుర్తి, సెప్టెంబరు, 18: పుల్లగుమ్మిలో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు రూ.14లక్షల చెక్కును టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, బలరాంగౌడ్, కాంతారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామకృష్ణాచారి, ఏవో అక్బర్ బాషా బుధవారం అందజేశారు. క్షణికావేశంతో రైతులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు. సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, టీడీపీ నాయకులు రమాకాంత్‌రెడ్డి, ఆనంద్, కృష్ణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వీరభద్రుడు, రామచంద్రుడు, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర పాల్గొన్నారు.

రెండు గ్లాసుల పద్ధతిపై డీఎస్పీ విచారణ


బస్టాండులోని దుకాణాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

నందవరం, సెప్టెంబరు 18: మండల కేంద్రంలో నమోదైన రెండు గ్లాసుల పద్ధతి కేసులో బుధవారం డీఎస్పీ శ్రీనివాస ఆచారి విచారణ చేశారు. టీ స్టాల్ యజమాని వినోద్‌కుమార్‌పై ఫిర్యాదు చేసిన కేసులో సాక్షుల వాంగ్మూలాలను తీసుకున్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి చుట్టుపక్కల వారితో మాట్లాడారు. ఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మఠం మేనేజర్‌గా వెంకటేశ్ జోషి



మంత్రాలయం, సెప్టెంబరు 18: మఠం మేనేజర్-ఏగా వెంకటేశ్‌జోషికి బాధ్యతలు అప్పగిస్తూ పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఆదేశాలు జారీ చేసినట్లు ఏఏవో మాధవశెట్టి బుధవారం తెలిపారు. మూడురోజుల క్రితం మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మేనేజర్-బీగా ఉన్న వెంకటేశ్‌జోషికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

జిల్లా డ్రగ్ అధికారి తనిఖీలు

పత్తికొండ, సెప్టెంబరు 18: పట్టణంలో మందుల దుకాణాలలో జిల్లా డ్రగ్ అధికారి పర్వీన్‌సుల్తానా షేక్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను, మందులను పరిశీలించారు. సాధారణ తనిఖీలలో భాగంగానే పత్తికొండకు వచ్చినట్లు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

కుటుంబానికి అండగా ఉంటాం

ఆస్పరి, సెప్టెంబరు 18: జనసైనికుడు మహానంది తల్లి పెద్ద సంజమ్మ అనారోగ్యంతో బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న ఆలూరు జనసేన ఇన్‌చార్జి వెంకప్ప ఆదేశాల మేరకు అరవింద్ మృతురాలికి నివాళి అర్పించారు. అనంతరం మనోధైర్యం చెప్పి, రూ.20వేలు అందజేశారు. ఉపాధ్యక్షుడు పూజారి శివ, శ్రీనివాసులు, రంజిత్, మహేష్, ప్రసాద్, విష్ణు, మధు పాల్గొన్నారు.

జొన్నగిరి ఎస్ఐగా జయశేఖర్

తుగ్గలి, సెప్టెంబరు 18: జొన్నగిరి ఎస్ఐగా జయశేఖర్ బాధ్యతలు బుధవారం తీసుకున్నారు. ఎస్ఐగా పని చేసిన రామాంజనేయులు కర్నూలు వీఆర్‌కు వెళ్లగా, ఏఎస్ఐకి బాధ్యతలు అప్పగించారు. అయితే కర్నూలు వీఆర్‌లో ఉన్న జయశేఖర్‌ను ఇక్కడ నియమించారు.

సీపీఐ నాయకుడి మృతి

ఆలూరు, సెప్టెంబరు 18: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సోదరుడు చిన్న రామకృష్ణ(60) బుధవారం మృతి చెందాడు సీపీఐ ఆలూరు కార్యదర్శిగా, రైతు సంఘం నాయకులుగా పని చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సంతాపం తెలిపారు.

అంతా మా ఇష్టం

- మంత్రాలయంలో రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- అడ్డదిడ్డంగా రాకపోకలు
- భక్తులు, గ్రామస్థుల ఇబ్బంది



ప్రధాన రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

మంత్రాలయం, సెప్టెంబరు 18: మంత్రాలయంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. పట్టించుకోవాల్సిన పోలీసులు పత్తా లేకుండా పోయారు. దీంతో భక్తులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శని, ఆదివారాలు, సెలవుదినాల్లో మరీ అస్తవ్యస్తంగా ఉంటోంది.

అడ్డదిడ్డంగా పార్కింగ్

ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, మహరాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తమ సొంత వాహనాల్లో వస్తుండటంతో వాటి పార్కింగ్‌కు స్థలం సరిపోవడం లేదు. ఎక్కడ పడితే అక్కడ నిలిపేస్తుండటంతో ఇతర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. ముఖద్వారం, శ్రీమఠ ప్రధాన రహదారి, రాఘవేంద్ర సర్కిల్, మాధవరం హైవే రోడ్డు, పోలీసుస్టేషన్, నాగలదిన్నే రోడ్డు, బస్‌స్టాండ్ రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పట్టించుకోని పోలీసులు

వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం లేదని ఆటోలు కూడా పెరిగిపోయాయని అంటున్నారు. లాడ్జిలు, హోటళ్లకు వచ్చేవారి వాహనాలు రోడ్డుపైనే నిలిపేస్తున్నా పోలీసులు అటు వైపు చూడటం లేదని సమాచారం. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్‌ను చక్కదిద్దాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. మఠం అధికారులతో చర్చిస్తాం. ఆటోల నియంత్రించి, సెలవు దినాల్లో భక్తుల ట్రాఫిక్‌కు విఘాతం కలగకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తాం
- పరమేష్ నాయక్, ఎస్ఐ, మంత్రాలయం

నకిలీ విలేకరుల బెదిరింపులు

- హోటళ్ల యజమానుల నుంచి వసూళ్లు

ఆదోని, సెప్టెంబరు 18: పట్టణంలోని రైల్వేస్టేషన్ రహదారిలోని ఓ హోటల్‌లో నకిలీ విలేకరులు బెదిరింపులకు పాల్పడి డబ్బు తీసుకొని వెళ్లిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు.. మంగళవారం హోటట్‌కి వెలల్ల నాన్-వెజ్ పార్శిల్ ఆర్డర్ చేశారు. సిబ్బంది పార్శిల్ ఇవ్వగా, గంట తరువాత ఆ ఇద్దరు నకిలీ విలేకరులు మరోసారి హోటల్‌కు వచ్చి పార్సిల్లో పురుగులు ఉన్నాయని బెదిరించి, తాము విలేకరులని యజమానిని బెదిరించి, ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫోన్‌చేసి హోటల్‌ను సీజ్ చేయిస్తానని హెచ్చరించారు. హోటల్‌లో వినియోగదారులు ఉండటంతో తిక్కుతోచని యజమాని మీ డబ్బులు తిరిగి ఇస్తానని అన్నారు. కాని సదరు నకిలీ విలేకరులు పెద్ద మొత్తంలో నగదు డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని, కొంత నగదు ఇవ్వడంతో వారు వెళ్లిపోయారు. విషయాన్ని టూటౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా హోటల్ యజమాని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

ఆదోనిలో ఇటీవల నకిలీ విలేకరుల వసూళ్ల ఎక్కువయినట్లు హోటళ్ల యజమానులు వాపోతున్నారు. నెల క్రితం మార్కెట్ యార్డు రహదారిలోని ఓ హోటల్ యజమానిని బెదిరించి వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం పోలీసులు స్పందించి, చర్యలు తీసుకోవాలని హోటల్ అసోసియేషన్ నాయకులు కోరుతున్నారు.

బాలికల మరుగుదొడ్ల నిర్మాణం


పనులను పరిశీలిస్తున్న నాగరాజు గౌడ్

ఆదోని టౌన్, సెప్టెంబరు 18: పట్టణంలోని గుజరాతీ భవనంలోని బాలికల వసతి గృహం ఏర్పాటు చేశారు. అయితే మరుగుదొడ్లు లేకపోవడంతో బాలికలు ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే సూచన మేరకు దాత సోమశేఖర్ గౌడ్ మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చి బుధవారం పనులను ప్రారంభించారు. బీజేపీ అసెంబ్లీ కో కన్వినర్ నాగరాజు గౌడ్ పనులను పరిశీలించారు.

వాల్మీకులను ఎస్టీలో చేర్చాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 18: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ డిమాండ్ చేశారు. 22న కర్నూలులో నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ రమేష్, వీరేశ్, బోగ్గుల వరుణ్, నరసప్ప, ఈరన్న, కురవళ్ళి మల్లయ్య, రాజు, ఉచ్చీరప్ప పాల్గొన్నారు.

పౌర్ణమి వేడుకలు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 18: పట్టణంలో బుధవారం పెద్దమ్మ ఆలయంలో పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

విలీనాన్ని ఉపసంహరించాలి

దేవనకొండ, సెప్టెంబరు 18: జీవో 117 ను రద్దు చేసి 1,2 తరగతులను అంగన్‌వాడీలో విలీనం చేయడాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడు శరత్ కుమార్ డిమాండ్ చేశారు. జడ్పీ పాఠశాలలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. భాస్కర్, మధు, ఉమేష్, లాలు, రమేష్ పాల్గొన్నారు.

బకాయిలు వసూలు చేయాలి

కోసిగి, సెప్టెంబరు 18: మండలంలోని స్త్రీనిధి బకాయిలను సకాలంలో వసూలు చేయాలని ఏజీఎం దయాసాగర్ సూచించారు. బుధవారం కోసిగిలోని స్త్రీశక్తి భవనంలో ఏపీఎం సత్యమ్మ అధ్యక్షతన వీవోఏలతో సమావేశం నిర్వహించారు.

క్రీడలతో మానసిక ఆరోగ్యం

కౌతాళం, సెప్టెంబరు 18: క్రీడలతో మానసిక ఆరోగ్యం కలుగుతుందని టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అడివప్ప గౌడ్, వెంకటపతిరాజు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు తెలిపారు. ఎ ఎరిగేరి జడ్పీహెచ్ పాఠశాలలో బుధవారం మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌ను అండర్-14, 17 ఆటల పోటీలను ప్రారంభించారు. క్రీడల మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి నివాళి అర్పించి క్రీడలను ప్రారంభించారు. రామలింగ, శ్రీరాములు, బసవరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 18: విద్యార్థులు పరిరక్షణకు కృషి చేయాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీమోహన్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ రెడ్డి అన్నారు. బుధవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో కళాశాలలో మొక్కలు నాటారు. ఎన్ఎస్ఎస్ అధికారి జోనాదన్ విక్లిఫ్, అధ్యాపకులు వెంకట్ రామిరెడ్డి, ఉమాదేవి పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌కు ఎంపిక


గాయత్రి(ఫైల్)

కౌతాళం, సెప్టెంబరు 18: మండలంలోని బాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని గాయత్రి అనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిందని తల్లిదండ్రులు రంగన్న, అనంతలక్ష్మి తెలిపారు. నీట్‌లో 720 మార్కులకు గాను 562 మార్కులతో స్టేట్ ర్యాంకు 5,094 ఆల్ ఇండియా ర్యాంకు1,21,690 వచ్చినట్లు తెలిపారు.

కాలం చెల్లిన వాహనాలు వద్దు

ఆదోని రూరల్ సెప్టెంబర్ 18: కాలం చెల్లిన వాహనాల్లో ప్రయాణించొద్దని రూరల్ సీఐ నల్లన్న సూచించారు. బుధవారం ఈ మేరకు ఆదోని-ఎమ్మిగనూరు బైపాస్‌లోని ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద వాహనాల తనిఖీ చేసి, కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలు చూపించని వారికి సీఐ జరిమానాలను విధించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- పత్తికొడ ఎమ్మెల్యే శ్యాంబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


దోమల మందును పిచికారీ చేస్తున్న శ్యాంబాబు, తిక్కారెడ్డి

పత్తికొండ, సెప్టెంబరు 18: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. బుధవారం పత్తికొండలో సర్పంచ్ కొమ్ముదీపిక, ఈవో నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసచ్చతలో పాల్గొని దోమలమందు పిచికారీ చేశారు. స్వచ్ఛ పత్తికొండ మన బాధ్యత అని, అపరిశుభ్రతతో దోమలు వ్యాప్తిచెంది ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. ఇందుకే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గ్రామస్వచ్ఛ త హీ సేవా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నా యని, దుకాణ దారులు, చిరువ్యాపారులు రోడ్లపై చెత్తవేయకుండా, చెత్తబుట్టలను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు.

నిధులను దోచేశారు: తిక్కారెడ్డి

గ్రామాల అభివృద్ధికి కేంద్రప్రభుత్వం ఇచ్చే నిదులను జగన్ ప్రభుత్వం దోచేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆరోపించారు. అధికారం చేపట్టిన వెంటనే చంద్ర బాబు గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి, తిరుపాల్, బత్తినిలోక్‌నాథ్, వెంకటపతి, దస్తగిరిరెడ్డి, చెక్కాగోపాల్, ఫకృద్దీన్, మీరాహుసేన్ ఉన్నారు.

దివ్యాంగులు అధైర్యపడవద్దు


ట్రై సైకిళ్లు ఇస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, సెప్టెంబరు 18: దివ్యాంగులు అధైర్యపవద్దని ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధించవచ్చని టీడీపీ నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు ఎంపీటీసీ రంగస్వామి, దేవేంద్ర అన్నారు. బుధవారం మదనంతపురం గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని అన్నారు.

ఘర్షణ, కేసు నమోదు

మంత్రాలయం, సెప్టెంబరు 18: మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన హుశేనీ, తాయన్న ఘర్షణ పడటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ బుధవారం తెలిపారు. వివరాల మేరకు.. పొలం రస్తా విసయంలో తాయన్న, హుశేనీల మధ్య మాటామాటా పెరిగి దాడి చేసుకున్నారు. ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదు మేరకు హుశేనీ అతని కొడుకు, తాయన్న, మరో వర్గం 6 మందిపై కేసు నమోదు చేశానేజ

వ్యక్తిపై కేసు నమోదు

పెద్దకడుబూరు: మండలంలోని చిన్నకడుబూరు గ్రామానికి లింగమూర్తి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ దాడిచేసి, పుట్టింటికి పంపినట్లు భార్య హైమావతి అన్న దశరథ రామిరెడ్డి ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, సెప్టెంబరు 18: మాధవరం గ్రామానికి చెందిన గూర్నింటి రామయ్య, మంత్రాలయం రాఘవేంద్రపురానికి చెందిన గురు రాజు, నాగప్ప నుంచి 528 పాకెట్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్, మంత్రాలయం ఎస్ఐ పరమేశ్ నాయక్ తెలిపారు. నిందితులను ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరచి, ఆదోని సబ్ జైలుకు తరలించారు.
కోసిగి: మండలంలోని అగసనూరు ఆర్డీఎస్ ఆనకట్ట సమీపంలో గ్రామానికి చెందిన గోవిందరాజులు, బారికి నరసప్ప, హరిజన సుందర్‌రాజు, సిద్ధప్ప నుంచి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకోండి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 18 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బాటనీ, ఎకనామిక్స్, తెలుగు బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సింహాద్రి ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ పూర్తి చేసి 55% మార్కులతో ఉత్తీర్ణత ఉండాలని అనుభవం, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. వివరాలకు వైఎంకే పాఠశాల ఆవరణ లోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.
దేవనకొండ, సెప్టెంబరు 18: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టు గెస్ట్ ఫ్యాకల్టీగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వేభుగోపాల్ శర్మ తెలిపారు. అనుభవం, అర్హతగలవారు 21లోగా దరఖాస్తు చేసుకొవాలని, 23న ఇంటర్వ్యూ ఉంటుందన్నారు.

దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం


ఆలూరులో మాట్లాడుతున్న మహానంది

ఆలూరు, సెప్టెంబరు 18: దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైనట్లు మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు మహానంది ఆరోపించారు. బుధవారం ఆలూరులో మాట్లాడుతూ పెద్దకడుబూరు మండలం కల్లుకుంటలో దళిత మహిళపై దాడి దారుణమన్నారు. దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.. చంద్ర, నరసప్ప, మల్లికార్జున, భరత్, నరసింహులు, వీరేష్, గంగన్న పాల్గొన్నారు.
పెద్దకడుబూరు: దళిత మహిళపై దాడి కేసును సమగ్రంగా విచారించాలని కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి, డీవైఎఫ్ఐ కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. బుధవారం ఎమ్మిగనూరులో బాధితురాలిని పరామర్శించారు. దేవసహాయం, తిమ్మప్ప, ఆంతోని, దేవదాసు, లాజర్, మోషె పాల్గొన్నారు.
ఎమ్మిగనూరు: ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంతున్న దళిత గోవిందమ్మకు అంబేడ్కర్ జయంతి, వర్ధంతి కమిటీ సభ్యులు రూ.20 వేలు అందించారు. ముందుగా వేదాస్ డైరెక్టర్ సునీల్ కుమార్, హైకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్, ప్రభాకర్, మాల నరసన్న, ముత్తు, రవి, దొరబాబు, సందీప్, డేవీడ్, మూజెస్, విష్ణు, పందికోన ఈరన్నలు పాల్గొన్నారు.పాల్గొన్నారు.
ఎమ్మిగనూరు, సెప్టెంబరు 18: దళిత గోవిందమ్మపై హింసకు పాల్పడిన వారందరిపై కేసులు నమోదు చేయాలని కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి ఆంద్రూ మాల్యాద్రి, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. బుధవారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం ఆధ్వర్యంలో బాధితురాలని పరామర్శించారు. కలెక్టర్, ఎస్పీ గ్రామాన్ని సందర్శించకపోవటం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. తిమ్మన్న, చిన్నప్ప, ఆంతోని, సురేష్, రవి, దాసు, రాజు, లక్ష్మన్న, గుంటెప్ప, రంగన్న, ఆనందు, అరుణ్, లక్ష్మన్న లక్ష్మన్న పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి : సీఐ

తుగ్గలి, సెప్టెంబరు 18: సైబర్ నేరస్థుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ సూచించారు. బుధవారం జొన్నగిరిలో సైబర్, రహదారుల భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోజురోజుకు సైబర్ నేరస్థులు పెరిగిపోతున్నాయని, సెల్‌ఫోన్లకు రాంగ్ కాల్స్, లింకులు పంపి, గిఫ్ట్ ప్యాక్‌లు వచ్చాయని ఓటీపీ చెపమని మభ్యపెట్టి, బ్యాంకు అకౌంటులోని నగదును కాజేస్తున్నారని అన్నారు. ఏటీఎంలు, బ్యాంకుల వద్ద పాస్‌వర్డు, పిన్ నెంబర్లను ఎవరికీ చెప్పవద్దని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో బ్యాంకు లావాదేవీల గురించి చర్చించకూడదని తెలిపారు. వాహనదారులు అన్ని రికార్డులను కలిగి ఉండాలని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని, పరిమిత వేగతంతో ప్రయాణించాలని సూచించారు. భారీ వాహనాలు, కార్లు, డ్రైవర్లు ఖచ్చితంగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ కోరారు. ఏఎస్ఐ రంగస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

శతక గ్రంథావిష్కరణ


బల్లారి ఉమాదేవి

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 18 : ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు బల్లారి ఉమాదేవి రచించిన మూడు పురాణ శతక గ్రంథాలను రచయిత తొపెళ్ళ బాలసుబ్రమణ్యం హైదరాబాద్ ఎల్బీ నగర్ అయ్యప్ప స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. రచయిత ఉమాదేవి మాట్లాడుతూ శారదాంబ శతకం, హనుమద్ శతకం, హనుమోదరణ కావ్యం అనే మూడు గ్రంథాలను రచించానన్నారు. తాను 11 పుస్తకాలు, 50వేల పద్యాలు, 2500 కవితలు, 300 పాటలను రచించినట్లు తెలిపారు. నాలుగు పుస్తకాలు ముద్రణలో ఉన్నాయని అన్నారు. ప్రముఖ రచయిత తొపెళ్ల బాలసుబ్రమణ్యం చేతుల మీదుగా ఆవిష్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు.

అలరించిన సంగీత కచేరీ

మంత్రాలయం, సెప్టెంబరు 18: మఠంలో బుధవారం రాత్రి నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అలరించింది. యోగేంద్ర కళామండపంలో బెంగుళూరుకు చెందిన అర్చన కులకర్ణి, నాగచంద్ర కవాల్, వసంత కుమార్, హరీష్, అనంత పద్మనాభ, లోకేశ్, శివమొగ్గకు చెందిన సురేష్ హెగ్డె, ఉడిపికి చెందిన సంగీత బాలచంద్రల ఆలపించిన భక్తి గీతాలు భక్తలను మైమరిపించాయి. భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రముగ్ధులయ్యారు. కళాకారులను పీఠాధిపతి సుబుధేం ద్రతీర్థులు నగదు, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, ఐపీ నరసింహ మూర్తి, బీఎం ఆనందరావు, జేపీ స్వామి, మంచాలి పద్మనాభాచార్, ప్రిన్సిపాల్ వాదిరాజాచార్, రమణారావు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు


సీఎంతో రాఘవేంద్ర రెడ్డి


హొళగుంద టీడీపీ నాయకులు


నారాయణ రెడ్డి


దేవనకొండ టీడీపీ నాయకులు


కేఈతో బాలిక

మంత్రాలయం, సెప్టెంబరు 18: విజయవాడ వరద బాదితులకు మంత్రాలయం టీడీపీ సీనియర్ నాయకుడు రాఘవేంద్రరెడ్డి రూ.21.08 లక్షల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి ఆర్డీఎస్‌కు రూ.200 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టాలని గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలకు రూ.4.27 కోట్లు కేటాయించాలలని కోరినట్లు తెలిపారు. ఉలిగయ్య పాల్గొన్నారు.
హొళగుంద: మండలంలో సేకరించిన రూ.5 లక్షల చెక్కును అమరావతిలో సీఎం చంద్రబాబుకు బుధవారం అందజేసినట్లు టీడీపీ సీనియర్ నాయకుడు చిన్నహ్యాట శేషగిరి, కన్వీనర్ తిప్పయ్య, హెబ్బటం విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. చిన్నహ్యాట శేషగిరి రూ.50 వేలు, హెబ్బటం విష్ణువర్ధనరెడ్డి రూ.50 వేలు, మిగతా రూ.4లక్షల విరాళాలు కలిపి మొత్తం రూ. 5 లక్షల రూపాయలు సమకూరినట్లు తెలిపారు. దిడ్డి తిక్కస్వామి, శ్రీరంగ, మల్లికార్జున, లక్ష్మన్న , బీరువా సుభాన్ పాల్గొన్నారు.
ఆలూరు: రూ.1లక్ష చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేసినట్లు టీడీపీ రైతు కమిటీ రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి బుధవారం తెలిపారు.
దేవనకొండ: రూ.1.20 లక్షల చెక్కును సీఎంకు అందజేసినట్లు టీడీపీ నాయకులు బంకు శేకన్న ,రాజశేకర్‌గౌడ్, మల్లెపల్లె రంగడు, వెల్డింగ్ దస్తగిరి శ్రీనివాసులు, రమేష్ తెలిపారు.


వెంకటేష్ చౌదరి

ఆస్పరి: రూ.లక్ష సీఎంకు అందజేసినట్లు టీడీపీ నాయకులు జొహరాపురం వెంక టేష్ చౌదరి, ముత్యాలరెడ్డి అన్నారు.

పాకెట్ మనీ ఇచ్చిన బాలిక

పత్తికొండ: తాను దాచుకున్న రూ.1,500 వరద బాధితులకు పట్టణానికి చెందిన 11 ఏళ్ల బాలిక కృతి ఎమ్మెల్యే కేఈకి అందించింది.